క్లుప్తంగా

పోలీసు సేవాపతకానికి ఎంపిక

నిర్మల్: ఈ ఏడాది పోలీసు శాఖ ప్రకటించిన సేవాపతకానికి జిల్లా నుంచి ఐదుగురు ఎంపికయ్యారు. ఈ మేరకు డీజీపీ అంజనీ కుమార్ శుక్రవారం రాత్రి ప్రకటన జారీ చేశారు. ఎంపికైన వారిలో డీసీఆర్బీ డీఎస్పీ రవీందర్‌రెడ్డి, ఏఆర్ ఎస్సై వెంకటేశ్వరరావు, సోన్ ఏఎస్సై దల్లుసింగ్, నిర్మల్ హెడ్ కానిస్టేబుళ్లు పి.జైకిష్ణ, సీహెచ్.నర్సయ్య ఉన్నారు.

వేధిస్తే ఫిర్యాదు చేయండి

సోన్: ఆకతాయిలు వేధింపులకు గురి చేస్తే విద్యార్థినులు ధైర్యంగా 100కు ఫిర్యాదు చేయాలని షీటీం సిబ్బంది పేర్కొన్నారు. శుక్రవారం సోన్ ఉన్నత పాఠశాలలో షీటీం సిబ్బంది రమ, లింగయ్య విద్యార్థినుల కు పలు అంశాలపై అవగాహన కల్పించారు. అవసరం మే రకే ఫోన్ వాడాలన్నారు. సామాజిక మాధ్యమా లకు దూరం ఉండి చ దువుపై దృష్టి సారించాలన్నారు. సైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్తలను వివరించారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెక్‌డ్యాంలు పరిశీలన

ఖానాపూర్: అధిక వర్షాల వరదతో పట్టణంలోని జేకేనగర్ ఎగువభాగం అటవీ ప్రాంతంలో తెగిపోయిన కుంటలు, చెక్‌డ్యాంలను శుక్రవారం అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించారు. మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్ మాట్లాడారు. వరదలకు తెగిపోయిన చెక్‌డ్యాంలకు మరమ్మతులు చేయించాలని అధికారులను కోరారు. తహసీల్దార్ రాజమోహన్, ఎఫ్ఆర్వో వినాయక్, ఎంపీడీవో మల్లేశ్, కమిషనర్ మనోహర్, తదితరులు ఉన్నారు.

‘దగా చేస్తున్న ప్రభుత్వం’



జెండా ఎగురవేస్తున్న మోహన్‌రావు పటేల్

కుభీర్: బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులను దగా చేస్తోందని బీజేపీ నాయకులు భోస్లే మోహన్ రావ్ పటేల్ అన్నారు. శుక్రవారం మండలంలోని బ్రహ్మేశ్వర్, చొక్లనాయక్‌తండా, సేవాదాస్‌నగర్, భూతాలితండాలో గడపగడపకూ బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించే కరపత్రాలు పంపిణీ చేశారు. అంతకుముందు గ్రామాల్లో పార్టీ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో కార్యకర్తలు పాల్గొన్నారు.

వాహనదారులకు అవగాహన

ముథోల్: వాహనదారులు వాహనాలను జాగ్రత్తగా నడపాలని ఎస్సై సాయికిరణ్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం రోడ్డు భద్రత నిబంధనలపై వాహనదారుల కు అవగాహన కల్పించారు. వాహనదారులు హెల్మెట్, సీటుబెల్టు ధరించాలన్నారు. ధ్రువపత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు.

అడెల్లి ఆలయంలో పూజలు



పూజలు చేస్తున్న మహేశ్వర్‌రెడ్డి

సారంగాపూర్: జిల్లాలో ప్రసిద్ధి గాంచిన శ్రీఅడెల్లి మహాపోచమ్మ ఆలయంలో శుక్రవారం బీజేపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయనకు ఆలయ సిబ్బంది తీర్థప్రసాదాలు అందజేశారు. బీజేపీ పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జి రావుల రాంనాథ్, ఒడిసెల శ్రీనివాస్, మండలాధ్యక్షుడు విలాస్, రాజేశ్వర్‌రెడ్డి, సాగర్, అర్జున్, భూపతిరెడ్డి, రాజేందర్ తదితరులు ఉన్నారు.

శాకాంబరి ఉత్సవాలు



పూజలో పాల్గొన్న భక్తులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని హరిహర క్షేత్రం మల్లన్నగుట్ట నందు లలితా పరమేశ్వరి ఆలయంలో శుక్రవారం శాకాంబరి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తలు అల్లోల వినోదమ్మ-మురళీధర్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అమ్మవారికి పంచామృతాభిషేకాలు, కలశ పూజ, కుంకుమార్చన, నూతన వస్త్రాలతో, కూరగాయలతో అలంకరణ చేశారు. భక్తులు భారీ సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

పాఠశాలలో వైద్యశిబిరం

దస్తురాబాద్: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి కామేశ్వర్ 62 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి.. అవసరమైన వారికి మందులు అందించారు. ప్రధానోపాధ్యాయుడు వేణు, ఉపాధ్యాయులు కొమురయ్య, శ్రీనివాస్, లక్ష్మి తదితరులు ఉన్నారు.

శిథిలావస్థకు కార్యాలయం

- వర్షాలకు ఊరుస్తూ.. గోడలు బీటలు వారుతున్న తహసీల్దార్ భవనం
- ఎప్పుడేం జరుగుతుందోనని సిబ్బంది ఆందోళన
- సౌకర్యాల్లేక ప్రజల ఇక్కట్లు
- మరమ్మతులు చేయించాలని వేడుకోలు



కార్యాలయంలో బెంచీల్లేక నిలబడి ఉన్న ప్రజలు



శిథిలావస్థకు చేరిన తానూరు తహసీల్దార్ కార్యాలయం

తానూరు: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. దీంతో ఎప్పుడేం జరుగుతుందోనని అధికారులు, కార్యాలయానికి వచ్చే ప్రజలు భయాందోళన చెందుతున్నారు. 1994లో నిర్మించిన భవనం కావడంతో వర్షాలకు గదులు ఊరుస్తున్నాయి. గోడలు బీటలు వారి ప్రమాదకరంగా మారాయి. వర్షాకాలంలో భవనంపై నుంచి నీరు వచ్చి గదుల్లో ఉంచిన దస్త్రాలు, రిజిస్టర్లు తడుస్తున్నాయని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కనీస సౌకర్యాలు కరువు..

29 ఏళ్ల కిందట భవనం నిర్మించినా ఇప్పటివరకు మరమ్మతులు చేపట్టకపోవడంతో శిథిలావస్థకు చేరింది. కొన్ని గదులు పెచ్చులూడిపోయి ప్రమాదకరంగా మారాయి. ఇందులో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది భయాందోళన చెందుతున్నారు. కార్యాలయంలో కనీసం కూర్చొనేందుకు బెంచీలు కూడా ఏర్పాటు చేయలేదని.. భూమి రిజిస్ట్రేషన్ల ద్వారా



గదిలో ఊడుతున్న పెచ్చులు

ప్రభుత్వానికి ఆదాయం వస్తున్నా సౌకర్యాలు కల్పించడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు.

నెరవేరని ఎమ్మెల్యే హామీ..

మరమ్మతులు చేపట్టాలని ఉన్నతాధికారులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదు. గతంలో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే విఠల్‌రెడ్డికి స్థానిక సర్పంచ్ విఠల్ సమస్య విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే భవన మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కానీ ఇప్పటివరకు నిధులు మంజూరుకు నోచుకోనేలేదు.

సౌకర్యాలు కల్పించాలి



తహసీల్దార్ కార్యాలయంలో సౌకర్యాలు ఏర్పాటు చేయాలి. వివిధ పనుల కోసం వస్తున్న ప్రజలు నేలపై గంటల తరబడి కూర్చొంటున్నారు. అధికారులు కార్యాలయానికి మరమ్మతులు చేపట్టి సమస్యలు పరిష్కరించాలి.

రమేశ్, కోలూరుతండా

ఉన్నతాధికారుల దృష్టికి..

తహసీల్దార్ కార్యాలయంలో సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరవగానే భవనానికి మరమ్మతులు పూర్తి చేసి కార్యాలయంలో సౌకర్యాలు కల్పిస్తాం. అప్పటివరకు తాత్కాలిక చర్యలు చేపడుతాం.

– రవికుమార్, ఆర్డీవో, భైంసా

మంచికి మారుపేరు భీంరెడ్డి

- విగ్రహాలవిష్కరణలో మంత్రి ఐకేరెడ్డి



విగ్రహావిష్కరణలో మంత్రి ఐకేరెడ్డి, తదితరులు

లక్ష్మణచాంద: మంచికి, అభివృద్ధికి మారుపేరు నల్ల భీంరెడ్డి అని రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని వడ్యాల్ గ్రామ పంచాయతీ ఆవరణలో దివంగత నల్ల భీంరెడ్డి, ఆయన కుమారుడు దివంగత రాంరెడ్డి విగ్రహాలను మంత్రి ఆవిష్కరించి మాట్లాడారు. ఉమ్మడి ఆదిలాబాద్‌కు సమితి ప్రెసిడెంట్‌గా, వడ్యాల్‌కు 23 ఏళ్లు భీంరెడ్డి సర్పంచ్‌గా సేవలు అందించారన్నారు. కనకాపూర్-లక్ష్మణచాంద రోడ్డు, విద్యుత్ సౌకర్యం, పరిమండల్ ఆనకట్ట, ప్రభుత్వ పాఠశాల ఆయన కృషితోనే సాధ్యమయ్యాయని తెలిపారు. రాంరెడ్డి కూడా తండ్రి బాటలోనే పయనించి గ్రామాభివృద్ధికి పాటు పడ్డారన్నారు. ప్రభుత్వ పాఠశాల, పశువుల ఆసుపత్రి, పంచాయతీ భవనాలకు తమ సొంత భూములను దానం చేసిన భీంరెడ్డి కుటుంబసభ్యులను గ్రామస్తులు మర్చిపోరన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ రఘునందన్‌రెడ్డి, నిర్మల్ మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, నిర్మల్ ఎంపీపీ రామేశ్వర్ రెడ్డి, జెడ్పీటీసీ రాజేశ్వర్, సర్పంచ్ లలిత, వైస్‌ఎంపీపీ కల్పనరెడ్డి, వైద్యులు గోవర్ధన్ రెడ్డి, విలాస్‌రెడ్డి, వికాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి పండుగ ఉత్సవాలు

ఖానాపూర్: పట్టణంలోని తిమ్మాపూర్, ఖానాపూర్ వీడీసీల ఆధ్వర్యంలో మహాలక్ష్మి పండుగ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శివాజీనగర్‌లోని ఆలయం వద్ద తిమ్మాపూర్ వీడీసీ ఆధ్వర్యంలో.. శ్రీరాంనగర్‌లోని ఆలయం వద్ద ఖానాపూర్ వీడీసీ ఆధ్వర్యంలో ఉత్సవాలను వేర్వేరుగా నిర్వహించారు. పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పద్మశాలి సంఘ సభ్యులు పట్టువస్త్రాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం ఆలయాల్లో ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ పూజలు చేశారు. కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు తదితరులు ఉన్నారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రేఖానాయక్

అల్ఫోర్స్‌లో బోనాల పండుగ



సంప్రదాయ వేషధారణలో అల్ఫోర్స్ విద్యార్థులు



ఖానాపూర్‌లో బోనాలతో చిన్నారులు

నిర్మల్: తెలంగాణ సంస్కృతిలో బోనాల పండుగకు ఎంతో ప్రాముఖ్యత ఉందని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డా.నరేందర్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని ఆదర్శనగర్ అల్ఫోర్స్ పాఠశాలలో శుక్రవారం బంగారు బోనం ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బోనాల పండుగ నిర్వహించగా అమ్మవారు, పోతరాజులు వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు. ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఖానాపూర్: పట్టణంలోని ధృవ హైస్కూల్ ఆధ్వర్యంలో బోనాల పండుగ నిర్వహించారు. బోనాలు ఎత్తుకోవడంతోపాటు పోతరాజుల వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఆకుల శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

పరిశుభ్రత పాటిస్తేనే రోగాలు దూరం

లక్ష్మణచాంద: వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే రోగాలు దూరం అవుతాయని ఎంపీడీవో శేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం ఫ్రై డే డ్రై డేలో భాగంగా మండలంలోని పార్‌పెల్లి, మునిపెల్లి, ధర్మారం, పీచర గ్రామాల్లో పర్యటించి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఎంపీవో నసీరుద్దీన్, వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు ఉన్నారు.

సోన్: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని న్యూవెల్మల్ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సమత అన్నారు. శుక్రవారం న్యూవెల్మల్ పంచాయతీ పరిధిలో డ్రై డే నిర్వహించారు. పాతటైర్లు, నిల్వనీటిని సిబ్బంది చేత పారబోయించారు. కార్యదర్శి భూపాల్, వీడీసీ అధ్యక్షులు రెమ్మాయి సాగర్, కొండ రవి, సూపర్‌వైజర్ వరలక్ష్మి, హెల్త్ ఆఫీసర్ రాజేశ్వర్, ఏఎస్ఎం సునీత తదితరులున్నారు.

నిర్మల్‌టౌన్: పట్టణంలోని పలు కాలనీల్లో శుక్రవారం ఫ్రైడే, డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. పట్టణ శానిటరీ ఇన్‌స్పెక్టర్ దేవిదాస్ జ్వరాలు బారిన పడకుండా జాగ్రత్తలను వివరించారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి..

కడెం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్ శివకుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని కొండుకూర్ గ్రామంలో డ్రై డే నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ వేణుగోపాల్, ఏఎస్ఎం రాణి, అంగన్‌వాడీ టీచర్ గంగామణి, ఆశ వర్కర్ దేవిక తదితరులు ఉన్నారు.



సోన్: డ్రై డేలో పాల్గొన్న మెడికల్ ఆఫీసర్ సమత

సారంగాపూర్: వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని ఎంపీపీ మహిపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని ధని ఉన్నత పాఠశాలలో శుక్రవారం కమ్యూనిటీ ఇంకుడుగుంత నిర్మాణం ప్రారంభించారు. అనంతరం పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ధనిలోని నర్సరీని ఎంపీపీ, ఎంపీడీఓ సరోజ, ఎంపీఓ తిరుపతిరెడ్డి పరిశీలించారు. ఆయిటి చందు, హెల్త్ సూపర్‌వైజర్ కృష్ణమోహన్ గౌడ్, కరుణ తదితరులు ఉన్నారు.

ముథోల్: మండలంలోని మచ్కల్‌లో శుక్రవారం డ్రై డే నిర్వహించారు. సర్పంచ్ మైసాజీ సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించి జాగ్రత్తలు వివరించారు. కార్యదర్శి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



లోకేశ్వరంలో..

లోకేశ్వరం: మండల కేంద్రంలో ఎంపీడీవో సోలమాన్‌రాజ్ పర్యటించారు. వీధులు తిరుగుతూ సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు వివరించారు. కార్యదర్శి వినయ్ సిబ్బంది ఉన్నారు.

కుంటాల: కుంటాలలో వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాలపై ఇంటింటా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ సమత, కార్యదర్శి రాజబాపు, హెల్త్ సూపర్‌వైజర్ దుర్గాభవాని, ఏఎస్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

కుంటాల మండలంలోని లింబా(బి), లింబా(కె), ఓలా గ్రామాల్లో ప్రత్యేకాధికారి మసార్‌రావు పర్యటించారు. వైకుంఠధామం, సెగ్రిగేషన్‌షెడ్లు, నర్సరీలను పరిశీలించారు. ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఎంపీవో రహీం, సర్పంచ్‌లు మల్లేష్, కనీష్‌ఫాతిమా, ఆనంద్‌రావు పటేల్, కార్యదర్శులు యోగేశ్, సుమన్, గంగాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

చంద్రయాన్–3 ప్రయోగం వీక్షణ

తానూరు: ఇస్రో చేపట్టిన చంద్రయాన్-3 ప్రయోగం విద్యార్థులు వీక్షించేలా మండల కేంద్రంతోపాటు ఎల్వి జిల్లా పరిషత్ పాఠశాలల్లో టీవీలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చంద్రుడి ఉపరితలంపై ల్యాండింగ్, రోవర్ సామర్థ్యాలను వివరించారు. ప్రధానోపాధ్యాయులు భూమన్నయాదవ్, సుభాష్ మోస్లే, మాధవ్‌రావ్, సుదర్శన్, సుజాతదేవి, గంగామణి, రమేశ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మామడ: చంద్రయాన్-3 అంతరిక్ష ప్రయోగాన్ని శుక్రవారం మండలంలోని కొరిటికల్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో విద్యార్థులు టెలివిజన్‌లో వీక్షించారు. ప్రయోగంపై పొన్కల్‌లో యువకులు సంబరాలు చేసుకున్నారు.



తానూరు పాఠశాలలో వీక్షిస్తున్న విద్యార్థులు

కుంటాల: చంద్రయాన్-3 ప్రయోగం కక్ష్యలోకి వెళ్లడంతో కుంటాల శాంతినికేతన్ పాఠశాలలో విద్యార్థులు జాతీయ జెండాలను పట్టుకొని సంబరాలు చేసుకున్నారు. ప్రిన్సిపాల్ సంతోష్, డైరెక్టర్ భోగ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే

- టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొజ్జు

కడెం: రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు అన్నారు. శుక్రవారం కడెంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు తుమ్మల మల్లేశ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పార్టీ మండల కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు వరంగల్ డిక్లరేషన్ హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో రఫీక్, వాజిద్‌ఖాన్, బబ్లూ, భూషణం, రమేశ్, సలీం, రాజు, రాజన్న తదితరులు ఉన్నారు.



పార్టీ కార్యాలయం ప్రారంభిస్తున్న బొజ్జు

గ్రామాల్లో ఘనంగా తెప్పోత్సవం

కుంటాల: మండలంలోని కల్లూర్, అందకూర్, ఓలా గ్రామాల్లో శుక్రవారం ఘనంగా తెప్పోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండాలని మహిళలు చెరువులు, వాగుల వద్ద పూజలు చేశారు. అనంతరం తెప్పల్లో దీపం ఉంచి నీటిలో వదిలారు.

భైంసారూరల్: మండలంలోని మహాగాం గ్రామంలో మహిళలు తెప్పలను గంగమ్మ ఒడికి చేర్చారు. శుక్రవారం మహిళలు తెప్పలను తలపై పెట్టుకుని సమీపంలోని చెరువుల వద్ద పూజలు నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండాలని వేడుకున్నారు.



కల్లూర్‌లో తెప్పలు వదిలేందుకు వెళ్తున్న మహిళలు

మురుగునీరు..రోడ్డుపైనే పారు..!



వివేకానంద చౌరస్తాలో రోడ్డుపై మురుగునీరు



ఆక్రమణలు తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

- తొలగింపు చర్యలు ప్రారంభం

భైంసాటౌన్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో డ్రెయినేజీలు సక్రమంగా లేకపోవడంతో మురుగునీరంతా రోడ్డుపైనే పారుతోంది. వర్షాలకు ఎగువప్రాంతంలోని మురుగునీరు పారేందుకు డ్రెయినేజీలు లేక వాహనదారుల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతోంది. పట్టణంలోని వివేకానంద చౌరస్తాలో ఏఎంసీకి చెందిన దుకాణ సముదాయం వద్ద ఏటా వర్షాకాలంలో డ్రెయినేజీ నీరు రోడ్డుపై పారుతోంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న మున్సిపల్ అధికారులు శుక్రవారం మురుగునీటితోపాటు డ్రెయినేజీపై పొక్లెయిన్‌తో ఆక్రమణల తొలగింపు చేపట్టారు. మురుగునీరు సజావుగా వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ వెంకటేశ్వర్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

తానూరు: మరమ్మతుల కారణంగా మండలకేంద్రంతోపాటు దాగాం, నంద్‌గాం, సింగన్‌గాం, దౌలతాబాద్, ఖర్బాల గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ జాదవ్ ప్రదీప్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని.. వినియోగదారులు సహకరించాలని కోరారు.

దిష్టిబొమ్మ దహనం

మామడ: మండలంలోని పొన్కల్ గ్రామంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు దిష్టిబొమ్మను దహనం చేశారు. సర్పంచ్ భూమేశ్వర్, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

కుంటాల: మహిళలు పొదుపు చేసి ఆర్థికంగా ఎదగాలని సర్పంచ్‌లు బక్కి సునీత, భోజాబాయి సూచించారు. శుక్రవారం మండలంలోని సూర్యాపూర్, పెంచికల్‌పాడ్ గ్రామాల్లో 2022-23లో జరిగిన లావాదేవీలపై నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. శ్రీ నిధి మేనేజర్ స్వాతి, సీసీలు పెంటన్న, యూసుఫ్, కార్యదర్శులు రాజు, సారిక, అకౌంటెంట్ శివప్రసాద్, వీవోఏలు మహేశ్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపూర్ గ్రామాఖ్య సంఘం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షురాలిగా రొడ్డ శ్రీలత, కార్యదర్శిగా సంగీత, కోశాధికారిగా పోషాణి, ఉపాధ్యక్షురాలిగా పోసాని, సహా కార్యదర్శి కుబీరే లక్ష్మి ఎన్నికైనట్లు వీవోఏ మహేశ్ తెలిపారు.

విద్యార్థులకు సన్మానం

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్‌తోపాటు కడెం మండలం లింగాపూర్ ప్రభుత్వ పాఠశాలల్లో చదివి బాసర ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన 11 మంది విద్యార్థులను ఖానాపూర్ వాసవిక్లబ్, వనితాక్లబ్ ఆధ్వర్యంలో సన్మానించారు. నాయకులు జితేందర్, కిషన్, లక్ష్మీనారాయణ, సతీశ్, మానస, స్రవంతి, వరలక్ష్మి, శ్వేత, బుచ్చన్న, రాజేందర్, మాధవి, గీతారాణి తదితరులు ఉన్నారు.

కందూర్ పండుగ

లక్ష్మణచాంద: మండలంలోని పొట్టపెల్లి, కనకాపూర్, పీచర గ్రామాల్లో కందూర్ పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల మహిళలు దర్గాల వద్ద పూజలు, ప్రార్థనలు చేశారు.

సంక్షిప్త వార్తలు

బీఆర్ఎస్‌తోనే ప్రజా సంక్షేమం

కడెం: బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఆ పార్టీ నాయకులు బాదవత్ పూర్ణచందర్‌నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని లింగాపూర్‌లో ఆయన పర్యటించారు. ఈసందర్భంగా గ్రామస్తులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ భూమన్న, పలువురు పూర్ణ యువసేన నాయకులు ఉన్నారు.

ప్రొసీడింగ్ అందించిన ఎమ్మెల్యే

లోకేశ్వరం: మండలంలోని గడ్‌చాంద గ్రామంలో రజక సంఘం కమ్యూనిటీ భవన నిర్మాణం కోసం రూ.రెండున్నర లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి దేగాంలోని తన నివాసంలో నిధుల ప్రొసీడింగ్‌ను సంఘం సభ్యులకు అందజేశారు. సర్పంచ్ వెంకట్‌రావు, ఎంపీటీసీ జీవన్ తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ఖానాపూర్: తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని శుక్రవారం మండలంలోని గ్రామపంచాయతీ కార్మికులు ఎంపీపీ మోహిద్‌కు విన్నవించారు. కార్మికులు చంద్రశేఖర్, నాగరాజు, పోశెట్టి, స్వామి, తదితరులు ఉన్నారు.

దస్తురాబాద్: తమ సమస్యలు పరిష్కరించాలని మండలంలోని పంచాయతీ కార్మికులు శుక్రవారం ఎంపీపీకి వినతిపత్రం అందించారు. పంచాయతీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ తొమ్మిది రోజులుగా సమ్మె చేస్తున్నా.. ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం లోపించి కాలనీలు దుర్గంధం వెదజల్లుతున్నాయని పేర్కొన్నారు. నర్సయ్య, అంజన్న, రవి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీ, పీఎంపీల సమావేశం

సోన్: మండలంలోని కడ్తాల్ గ్రామంలో ఆర్ఎంపీ, పీఎంపీల మండల సమావేశం వారి సంఘ భవనంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండలాధ్యక్షుడు నవకాంత్ మాట్లాడారు. కరోనా తర్వాత ఆర్ఎంపీల పరిస్థితి దిగజారిందన్నారు. ప్రభుత్వం ఇచ్చే శిక్షణ కార్యక్రమాలను నిర్వహించడంతోపాటు పేద కుటుంబాలకు చెందిన ఆర్ఎంపీ, పీఎంపీలను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు రాజేందర్, వెంకటస్వామి, రమేష్ యాదవ్ పాల్గొన్నారు.

రైతుబీమా పత్రాలు అందజేత

కుభీర్: మండలంలోని పార్డి(బి)గ్రామంలో ఇటీవల పట్టాపాసు పుస్తకాలు పొందిన 35 మందికి రైతు బీమా పత్రాలను సర్పంచ్ పుష్ప అందజేశారు. బీఆర్ఎస్ జిల్లా కార్యదర్శి రాజేశ్వర్, ఉపసర్పంచ్ తుకారాం, సురేశ్ తదితరులు ఉన్నారు.

రక్త నమూనాల సేకరణ

లక్ష్మణచాంద: మండలంలోని పార్‌పెల్లి గ్రామంలో మండల ఆరోగ్య కార్యకర్త శివకృష్ణ.. పలువురు జ్వర పీడితులకు రక్త పరీక్షలు నిర్వహించారు. అనంతరం అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు.

కుంటాలలో భారీ వర్షం

కుంటాల: మండలంలో గురువారం అర్ధరాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో గ్రామాల్లో శుక్రవారం వ్యవసాయ పనులు కొనసాగలేదు. రోజంతా ఎండ వలన ఉక్కపోతతో ప్రజలు సతమతమయ్యారు. కల్లూర్ వాగు వద్ద చెక్‌డ్యాం వరదతో ఉధృతంగా ప్రవహించింది. ఆరు సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఏఎస్‌వో సాయన్న తెలిపారు.

పంటల వివరాలు నమోదు

లక్ష్మణచాంద: మండలంలోని పీచర, కనకాపూర్, లక్ష్మణచాంద క్లస్టర్ పరిధిలోని గ్రామాల్లో ఏఈవోలు ఉమామహేశ్వరి, సంతోష్, పవిత్ర పంటల సాగు వివరాలను నమోదు చేశారు. క్షేత్రస్థాయిలో పర్యటించి పంటల ఫొటోలతో అప్‌లోడ్ చేశారు.